క్లుప్తంగా

కొండచిలువ హతం



తిమ్మరాజు కాలనీలో కొండచిలువను హతం చేసిన స్థానికులు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామ శివారు తిమ్మరాజు కాలనీలోకి చొచ్చుకువస్తున్న కొండచిలువను స్థానికులు శనివారం గుర్తించి చంపేశారు. ఆ ప్రాంతంలో కాలువలో పూడిక తీస్తుండగా ప్రక్కనే ఉన్న కాలనీలోకి ప్రవేశించింది. ఇళ్లల్లోకి వస్తుందనే భయంతో స్థానిక యువకులు దానిని చంపివేశారు. పంట కాల్వలు, మురుగు కాల్వల్లో పూడిక తీత పనుల్లో కొండచిలువలు బయటపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చేపలు, రొయ్యల చెరువుల సమీపంలో తిరుగుతూ, కాల్వ గట్ల వెంబడి ప్రయాణిస్తూ కోళ్లను తింటున్నాయని చెబుతున్నారు.

సామాజిక అంశాలపై కళాజాత



గొరగనమూడి లో సామాజిక అంశాలపై కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడి పాఠశాల వద్ద తాడేపల్లిగూడెంకి చెందిన కళాకారుడు చిరంజీవి బృందంచే శనివారం సామాజిక అంశాలపై కళాజాత నిర్వహించారు. ముఖ్యంగా సామాజిక అంశాలకు సంబంధించిన మొక్కలు నాటే కార్యక్రమం గురించి, దోమల నిర్మూలన కార్యక్రమం గురించి, ప్లాస్టిక్ వాడకం నిషేధం గురించి, ప్రజారోగ్యం సంబంధించిన వివిధ అంశాల పై ఈ కార్యక్రమంలో కళాకారులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, స్కూల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


కార్మికుల చెమటను పీల్చే చర్యలొద్దు



స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీ.వాసుదేవరావు

ఆకివీడు: కార్మికుల చెమటను పీల్చేసే చర్యల్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు జేయాలనుకోవడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీ.వాసుదేవరావు ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడు అమలును వ్యతిరేకిస్తూ సైకిల్ యాత్ర చేస్తున్న ఆయన శనివారం ఆకివీడు వచ్చారు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో ఆయనకు కార్మికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు కార్మికుల హక్కుల్ని కాలరాచే విధంగా చర్యలు చేపట్టాయన్నారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటు పరంచే యోచనను విరమించుకోవాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన దేశ వ్యాప్త సమ్మెకు సీఐటీయూ పిలుపునిచ్చిందన్నారు. సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లిపూడి ఆంజనేయులు, పెంకి అప్పారావు, ఇంజేటి శ్రీను, బీ.కల్యాణి, బీ.రాంబాబు, బొర్రా సత్యం, నిమ్మల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార దినోత్సవం



మొక్కలు నాటుతున్న మురళీకృష్ణ

వీరవాసరం: గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని జిల్లా సహకార అధికారి సంకు మురళీ కృష్ణ తెలిపారు. అండలూరు విశాల సహకార పరపతి సంఘంలో శనివారం నిర్వహించిన 13వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు, రైతులకు, కార్మికులకు, వ్యవసాయ కూలీలకు సహకార సొసైటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ సహకార బ్యాంకులను సద్వినియోగ పరచుకోవాలన్నారు. సంఘ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిశుభ్రతను గూర్చి వివరించారు. సహకార ఉద్యమం యొక్క ప్రాధాన్యత గురించి తెలియజేస్తూ సహకార సంఘంపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి జి సత్యనారాయణ ,తెలబోయిన శ్రీనివాసరావు, రామదాసు, ఐ హుస్సేన్ ,లింగం శ్రీనివాస్, మమత, ఎల్వి సత్యనారాయణ, యాళ్లబండి శ్రీనివాస్ ,సంఘ సిబ్బంది ,సంఘ కార్యదర్శులు ,రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గాలివీస్తే గల్లంతే...

- ప్రమాదకర స్థితిలో విద్యుత్ స్తంభాలు
- ముంపునకు గురవుతున్న సబ్ స్టేషన్

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని, ప్రధానంగా పంట కాలువ గట్ల వెంబడి ఉన్న స్తంభాలతో స్థానికులు హడలి పోతున్నారు. ఉండి మండలంలోని పులిగుమ్మ పంట కాలువ పొడవునా, పాలకోడేరు మండలంలో మోగల్లు, వేంద్ర తదితర గ్రామాల నుంచి నుంచి భీమవరం వెళ్లే గంగాదేవి గుడి సమీపాన, తదితర కాలవగట్లు దగ్గర విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి. అలాగే కాళ్ల మండలంలోను, ఆకివీడు మండలంలోను గట్టిగా గాలి వేస్తే ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఏమాత్రం గట్టిగా గాలి వీచినా తక్షణమే సరఫరా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ సీజన్లో సంభవించిన అకాల వర్షాలకు భీమవరం సబ్ డివిజన్ పరిధిలో సుమారు 20 వరకు స్తంభాలు నెలకొరిగాయి. కొన్ని పరిస్థితుల్లో వివిధ చోట్ల లైన్లు దెబ్బతిన్నంతో ఆ శాఖకు 20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు అప్పట్లో తేల్చారు. యుద్ధపాతిపదికన చర్యలు చేపట్టిన గంటల తరబడి సరఫరాకు అంతరాయం తలెత్తింది. ప్రస్తుతం వర్షాకాలం అక్టోబర్ నెల వరకు ఈదురు గాలులు వేసే అవకాశాలు ఉన్నాయి. ఈ దశలో అధికారులు తక్షణం స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ స్తంభాలు గుర్తించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షం వస్తే సబ్ స్టేషన్ మునక

పాలకోడేరు మండలం మోగల్లు సబ్ స్టేషన్ నుంచి సుమారు 7 గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. అంత ప్రాధాన్యత గల ఈ సబ్ స్టేషన్‌కు ప్రహరీ గోడ లేకపోవడంతో వర్షం వస్తే ముంపుకు గురవుతుంది. వర్షం వచ్చినప్పుడు సరఫరాకు ఆటంకం ఏర్పడితే ఆ నీటిలోంచి సిబ్బంది మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అలాంటప్పుడు ఏ సమయానికి ఏం జరుగుతుందోనని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. పై అధికారులు ప్రజాప్రతినిధులు దీనిపై ప్రత్యేక దష్టి సారించాలని కోరుతున్నారు.



వర్షం వస్తే మునిగిపోతున్న మోగల్లు సబ్ స్టేషన్ (ఫైల్)



ఉండి మండలం కాలువ గట్టు వెంబడి ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాలు



మోగల్లు సబ్ స్టేషన్ మునిగిపోవడంతో ఆ నీటిలోంచే ట్రాన్స్‌ఫార్మర్ మోసుకెళ్తున్న సిబ్బంది (ఫైల్)

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి



గత ప్రభుత్వంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విద్యుత్తు లైన్లు వేసేటప్పుడు నియమ నిబంధనలు పాటిస్తే స్తంభాలు ఒరిగిపోవు. ఇబ్బడి ముబ్బడిగా వేస్తే ఇలాంటి సమస్యలే వస్తాయి. సమస్య వస్తే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

కె లాజరు, పాలకోడేరు మండలం, కుముదవల్లి

పవర్ కట్ సరికాదు



సమయం సందర్భం లేకుండా పవర్ కట్ చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంది. పగలు రాత్రి అని తేడా లేకుండా పవర్ ను నిలిపివేయడం సరికాదు. విద్యుత్ సమస్య వస్తే త్వరగా సమస్యను పరిష్కరించి ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి. గుంటపల్లి వెంకన్న, పాలకోడేరు మండలం, గరగపర్రు

గుంటపల్లి వెంకన్న గరగపర్రు

వెంటనే చర్యలు చేపడతాం

ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నాం. ఇంకా సమస్యలు ఎక్కడైనా మా దృష్టికి వస్తే ఆయా ప్రాంతాలను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటున్నాం. మా సిబ్బంది ఎప్పటికప్పుడు సరఫరా విషయాలు అంతరాయం లేకుండా చూడమని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.

మాధవ రాజు, ఏ ఈ, ట్రాన్స్కో పాలకోడేరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్ర పరిధిలోని ఆదివారం 11కేవీ ఎల్‌వీఎన్ పురం ఫీడర్‌పై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతల నిమ్మిత్తం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఎల్‌వీఎన్ పురం (ఎఫ్‌ఎల్ సొసైటీ), సీఏడీ కంపెనీ, పల్లిపాలెం, ఈలంపూడి గ్రామాలతో పాటు ఆక్వా లైన్లకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫసల్ బీమా యోజన రైతులకు ఉపయోగం

భీమవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకం రైతులకు ఎంతో ప్రయజనకరంగా ఉంటుందని తాడేరు పరపతి సహకార సంఘం కార్యదర్శి నందమూరి వెంకట సుబ్బారావు అన్నారు. భీమవరం మండలంలోని తాడేరులో సహకార పరపతి సంఘంలో శనివారం ఫసల్ బీమా యోజన బీమా పథకం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నందమూరి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఈ పథకాన్ని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (కేంద్ర ప్రభుత్వ సంస్థ) పైలట్ ప్రాజెక్టుగా పశ్చిమగోదావరి, విజయనగరం , సత్యసాయి జిల్లాల్లో ప్రవేశపెట్టి అమలు చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సొసైటీ పరిధిలో రైతులు ఎకరానికి రూ. 210 ఆగస్టు నెల 15 లోపు చెల్లిస్తే ఈ పథకం ద్వారా పంటల బీమా పొందవచ్చన్నారు. రైతులు ఈ పథకానికి ప్రీమియం చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏఐసీ) అసిస్టెంట్ మేనేజర్ సంపత్ కుమార్ నాయక్, జిల్లా కో ఆర్డినేటర్ చక్రధర్, డీసీసీ బ్యాంకు మేనేజర్ తిరుమల రెడ్డి నాయుడు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సదరం తిప్పలు

ఆకివీడు: దివ్యాంగుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు సదరంలో పేరు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వారు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. శనివారం సదరం సైట్ ఓపెన్ చేశారని ప్రకటించడంతో దివ్యాగులు ఆయా సచివాలయాల వద్దకు అష్టకష్టాల పడి చేరుకున్నారు. తీరా సర్వర్ పని చేయడం లేదని, సైట్ ఓపెన్ కావడంలేదని చెప్పడంతో వారు తీవ్ర నిరుత్సాహంతో వెనుదిరిగారు. ఆఖరికి ఒక్క అరగంట సేపు ఆన్‌లైన్ సైట్ పనిచేయడంతో వేళ్లపై లెక్కించే విధంగా కొంత మంది పేర్లు నమోదు చేసుకున్నారు. మళ్లీ సదరం సైట్ ఎప్పుడిస్తారోనని ఎదురుచూడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

లోక్ అదాలత్‌లో 1176 కేసుల పరిష్కారం



భీమవరంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ దృశ్యం

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సంస్థ చైర్మన్, 3వ అదనపు జిల్లాజడ్జి బి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఐదు బెంచ్‌లను ఏర్పాటు చేయగా 1176 కేసులు రాజీ అయ్యాయి. వీటిలో 21 సివిల్ కేసులు, 14 మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు, 303 క్రిమినల్ కేసులు, 801 అడ్మిషన్లు ఉన్నాయి. సుమారు రూ. 3.30 కోట్లు విలువైన కేసులు రాజీలు జరిగాయి. జాతీయలోక్ అదాలత్‌కు 3వ అదనపు జిల్లా కోర్టు పెండింగ్ కేసుల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన బెంచ్‌కు న్యాయమూర్తిగా లక్ష్మీనారాయణ వ్యవహరించగా మిగిలిన అన్ని కోర్టుల్లో పెండింగ్ సివిల్ కేసులు, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ మొండి బాకీల కేసుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన బెంచ్‌కు న్యాయమూర్తిగా సివిల్ జడ్జి ఎం సుధారాణి వ్యవహరించారు. బెంచ్ సభ్యులుగా న్యాయవాదులు జీవీ స్టీవెన్ బాబు, ఎం.బాల పరమేశ్వరరావు, జి సుధాకర్, వి.మోహనరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: మునిసిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని లేకుంటే దశల వారీగా ఉద్యమాలు చేపడతామని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు హెచ్చరించారు. మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల హక్కుల సాధనకు చేపట్టిన దశలవారి ఆందోళనల్లో భాగంగా శనివారం భీమవరం మునిసిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు, రంగారావు మాట్లాడుతూ మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అపరిష్కృత డిమాండ్స్ నెరవేర్చాలన్నారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల కనీస వేతనం రూ. 35 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణచేసిన, మృతి చెందిన ఇంజనీరింగ్ కార్మికుల కుటుంబ సభ్యులు, వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలాపు చిత్తరంజన్, నీలాపు శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



జువ్వలపాలెం సెంటర్‌లో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కాళ్ల: జూలై 9న దేశవ్యాప్త కార్మిక వర్గ సమ్మెని జయప్రదం చేయలని కోరుతూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీప్‌యాత్ర నిర్వహించారు. పెదఅమిరంలో ప్రారంభమైన యాత్ర కోపల్లె, సీసలి, కాళ్ళ, జువ్వలపాలెం, ఏలూరుపాడు మీదుగా ఆకివీడు చేరుకుంది. జువ్వపాలెం సెంటర్లో జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. యజమానులకు మేలు చేసే కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కుటమి ప్రభుత్వం కేంద్రం తందానా అంటే రాష్ట్ర ప్రభుత్వం తానా అంటుందని ఎద్దేవా చేశారు. కార్మిక కర్షక ఉద్యోగులకు తీవ్రంగా నష్టం చేసే చర్యలు కోరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి దూసి కళ్యాణి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి లారెన్స్, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఝాన్సీ రాణి, జిల్లా నాయకులు మండా సూరిబాబు, ఎం ఆంజనేయులు, ఇంజేటి శ్రీను, గొర్ల రామకృష్ణ, పైడితల్లి, దగ్గులూరి అనిత, గణేష్ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి



జెడ్పీ స్కూల్‌లో జూనోసిస్ డే సందర్భంగా ప్రదర్శన చేస్తున్న లయన్స్, వెటర్నరీ ఏడీ మల్లేశ్వరరావు



భీమవరంలో మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందచేస్తున్న లయన్స్‌క్లబ్ నాయకులు

భీమవరం: పెంపుడు జంతువుల యజమానులు తప్పనిసరిగా టీకాలు వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని భీమవరం లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా రాంబాబు, అల్లు తులసి ప్రసాద్ కోరారు. జూనోసిస్ డే పురస్కరించుకుని శనివారం మునిసిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డికి వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా మాట్లాడారు. పెంపుడు జంతువులకు వ్యాధులు సోకకుండా ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఉపయోగపడతాయని ప్రధానంగా కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి కనగర్ల విజయ రామకృష్ణ, కంతేటి వెంకట్రాజు, కోట్ల నాని, నందమూరి రాజేష్, నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, గోపిశెట్టి మురళీకృష్ణ, పాశం సుభద్రాదేవి,సరోజినీ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్

పాలకోడేరు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉచిత యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారిణి డాక్టర్ హేమ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి ప్రాంతీయ పశు వైద్యశాలలో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామన్నారు. మండలంలోని అన్ని పశు వైద్యశాలలు, రైతుసేవా కేంద్రాల వద్ద సైతం వ్యాక్సిన్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆకివీడు: ప్రపంచ జూనోటిక్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు, ఇతర కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించాలని మండల పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ కెల్లా భార్గవీ సత్య పిలుపునిచ్చారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచ జూనోటిక్ డే సందర్భంగా జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వచ్చే వ్యాధుల్ని నిరోధించేందుకు అవగాహన కల్పించే దిశగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని పశుసంవర్ధక శాఖ కార్యాలయాల వద్ద వ్యాక్సిన్ అందుబాటులో ఉందని చెప్పారు.

పెంపుడు కుక్కల పట్ల నిర్లక్ష్యం తగదు

ఆకివీడు: పెంపుడు కుక్కల పట్ల నిర్లక్ష్యం తగదని మండల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మల్లేశ్వరరావు చెప్పారు. స్థానిక జెడ్పీ స్కూల్‌లో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా అవగాహనా కార్యక్రమం ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ పెంపుడు కుక్కల్ని ప్రతిరోజూ శుభ్రం చేయాలన్నారు. యాంటీర్యాబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కాళ్ల గోళ్లను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్, కాకర్ల రాజరాజేశ్వరి, పుప్పాల పండు, మోరా జ్యోతిరెడ్డి, ఆదర్శ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల్లో సస్యరక్షణ చేపట్టాలి



గునుపూడిలో నారుమడులను పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

భీమవరం అర్బన్: నారుమడులలో సస్య రక్షణ చేపడితే నాణ్యమైన నారు వస్తుందని సాగులో చీడ పీడల ఉధృతి తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ సూచించారు. భీమవరంలోని గునుపూడిలో శనివారం మండల ఏవో ప్రసాద్ నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సెంట్ల నారుమడికి 12 -14 రోజుల మధ్య కిలో నత్రజని, కిలో బాస్వరం, కిలో పోటాష్ చల్లాలన్నారు. నారు ఆకు పూర్తిగా విచ్చుకునేవరకు ఆరుతడిగా నీరు పెట్టి తరువాత మడులలో నీటిని నిలువ చేయాలన్నారు. జింకు లోపాన్ని గమనిస్తే లీటర్ నీటికి రెండు గ్రాములు జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని చెప్పారు. విత్తిన పదిరోజులకు కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పు వేయాలని లేకపోతే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ., లేక క్లోరి పైరిఫాస్ 2.0 మి.లీ లీటర్ నీటికి కలిపి విత్తిన 10, 17 రోజులకు పిచికారి చేయాలి. నారు తీయడానికి 7 రోజులు ముందు సెంటు నారుమడికి 120 గ్రాముల కార్బోఫ్యూరన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా చల్లాలన్నారు. నారుమడిలో సస్య రక్షణ చేపడితే సాగులో చీడ పీడల ఉధృతి నుంచి తట్టుకుంటుందన్నారు. అనంతరం గునుపూడి సోమేశ్వరాలయం వద్ద కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

భీమవరం: భీమవరం పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థిని కనిపించడంలేదని బాలిక తండ్రి ఫిర్యాదు చేశారని టూటౌన్ పోలీసులు తెలిపారు. శ్రీరామ్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

టెండర్ దరఖాస్తుల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): శనివారం కలెక్టరేట్‌లోని జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్ లో రోగులకు ఆహారం సరఫరా చేసే టెండర్ల సీల్ డబ్బాను ఓపెన్ చేసి దరఖాస్తుదారుల సమక్షంలోనే జేసీ క్షుణ్ణంగా పరిశీలించారు.

అయ్యబాబోయ్..

- కుక్కల స్వైరవిహారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- కానరాని నియంత్రణ చర్యలు



గుల్లపాడు గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న ఊరకుక్కలు

భీమవరం అర్బన్: వీధి కుక్కల నియంత్రణ చర్యలపై చట్ట ప్రకారం స్పష్టమైన కార్యాచరణ ఉంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం దాన్ని అమలు చేస్తున్న దాఖలాలు లేవు. జీవావరణ వ్యవస్థలో వీధి కుక్కలకు కూడా ప్రత్యేక బాధ్యత ఉందని సంబంధిత నిపుణులు చెబుతుంటారు. అయితే పరిమితికి మించి వాటి సంతతి పెరిగితే నియంత్రణ చర్యలు చేపట్టాలని కూడా నిబంధనలు చెబుతున్నాయి. కానీ గ్రామస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.

నియోజకవర్గంలో...

రూరల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ సుమారు 200నుంచి 300 వరకు కుక్కలు ఉంటాయని అంచనా. వీటి సంతతిని నియంత్రించేందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాల్సి ఉంది. అయితే అటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వీటిని చంపడానికి ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే మూగజీవాలు రక్షణకు ఏర్పాటైన పలు సంస్థలు న్యాయ పరంగా అడ్డుకోవడాన్ని సాకుగా చూసి, అసలు నియంత్రణ చర్యలే చేపట్టం లేదని ప్రజలు చెబుతున్నారు.

స్వైరవిహారం

గ్రామాల్లో కుక్కలు స్వైర వివాహారం చేస్తున్నాయి. రోడ్లపై రాకపోకలు సాగించే ప్రయాణికుల వెంబడి పడుతున్నాయి. వాటి దాడిలో పలువురు గాయలుపడుతున్నారు. అలాగే కుక్కలు వెంటపడడంతో ద్విచక్ర వాహనాల నుంచి కింద పడి గ్రామాలపాలవుతున్నారు. మేకలు, గొర్రెలను కరిచి వాటిని చంపేస్తున్నాయని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే రాత్రి సమయంలో వాహనాలపై వెళ్తున్న వారని వెంబడించి, వెంటాడి కరుస్తున్నాయని పలువురు వాపోతున్నారు.

పట్టించుకోని పంచాయతీ శాఖాధికారులు

కుక్కల దాడిలో పిల్లలు మరణించడం, గాయాల పాలవడం వంటి సంఘటనలు జరుగుతున్నప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. కుక్కల నియంత్రణకు పంచాయతీలు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. కుక్కలు స్వైర విహారం చేసి పలువురిని గాయాలు పాలు చేస్తున్న పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వస్తున్నాయి.

పెరిగిన కుక్కల సంతతి

వీధి కుక్కల సంతతి ఎక్కడికక్కడే పెరిగిపోయింది. వాటి నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా మాంసాహార వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. అక్కడ పదుల సంఖ్యలో కుక్కలు గుమిగూడుతున్నాయి. సమీపంలోకి వెళ్లే వారిపై దాడికి ప్రయత్నిస్తున్నాయి. దీంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

బొమ్మిడి ధనలక్ష్మి, గృహిణి, దొంగపిండి